గ్రామాల్లో తాగునీటి కష్టాలు

- అడుగంటిన భూగర్భజలాలు
- సమస్యను పరిష్కరించాలని కోరుతున్న ప్రజలు


సారంగపూర్‌లో ధర్నా నిర్వహిస్తున్న మహిళలు(ఫైల్)

నిజామాబాద్ రూరల్: ఒకవైపు వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో రూరల్ మండల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. రూరల్ మండల పరిధిలోని సారంగపూర్ 13వ డివిజన్‌తో పాటు రాంనగర్, పలు గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉంది. సమస్యను సంబంధిత అధికారులకు కాలనీ వాసులు, గ్రామస్తులు పలుమార్లు విన్నవించినా స్పందన కరువైంది. ఇటీవల స్థానికులు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

రానున్న రెండు నెలలు ఎండలు తీవ్రంగా ఉంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని అధికారులు గ్రామాల్లో ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో వాటిని గుర్తించి తగు చర్యలు చేపట్టాలి.

గ్రామాల్లో ప్రత్యేక అధికారి పాలన కొనసాగుతున్నందున తాగునీటి సమస్యపై ఎవరిని అడగాలో తెలియక కొందరు గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సమస్య లేకుండా చూస్తాం

రూరల్ పరిధిలో 19 గ్రామాలు ఉన్నాయి. ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూస్తాం. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నందున భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ప్రజలకు మౌలిక వస్తువుల కల్పన ఏర్పాటు చేసే బాధ్యత మాపై ఉంది.

– ఇక్బాల్, ఎంపీవో

సమస్యను పరిష్కరించాలి

తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. అధికారులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలి. ఎండలు ఎక్కువగా ఉన్నందున మండలంలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– కొర్వ రాజేంద్రప్రసాద్, ఖానాపూర్

ప్రజా సంక్షేమానికి కృషి


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

సుభాష్‌నగర్: ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. అర్బన్ నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన అర్హులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. 130 మంది లబ్ధిదారులకు రూ.32,36,500 విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దరఖాస్తు చేసుకున్న వారికి చెక్కులు అందజేస్తున్నామని తెలిపారు. పైరవీలకు తావివ్వకుండా నేరుగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అన్ని పత్రాలు అందజేస్తే వీలైనంత త్వరగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం పేదలకు భారం కాకుండా దరఖాస్తు చేసుకున్న నెలలోపు చెక్కులు మంజూరు చేయాలని, అలాగే మొత్తంలో 50శాతం నిధులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు స్వామి యాదవ్, మాస్టర్ శంకర్, వినోద్‌కుమార్, నాగరాజు, ఎర్రం సుధీర్, పంచరెడ్డి శ్రీధర్, ఇప్పకాయల కిశోర్, గడ్డం రాజు, కార్యకర్తలు, మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి స్థల పరిశీలన


ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణం కోసం స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీవో రాజేంద్రకుమార్

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవన నిర్మాణానికి నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ స్థల పరిశీలన చేశారు. మండలంలోని నడిపల్లి శివారులో ఉన్న సర్వే నెంబరు 334లో ప్రభుత్వ స్థలం 6 ఎకరాలను పరిశీలించారు. తహసీల్దార్ ప్రభాకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదేశాల మేరకు స్థలాన్ని పరిశీలించినట్లు ఆర్డీవో తెలిపారు. కాంగ్రెస్ నాయకులు కంచెట్టి గంగాధర్, పాలసాని శ్రీనివాస్, తారాచంద్‌నాయక్, రాంచందర్ గౌడ్, న్యాసరాజేశ్వర్, సురేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బార్ అధ్యక్షుడు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మామిళ్ల సాయారెడ్డి శనివారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బార్ అధ్యక్షుడిని, అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది అమిడాల సుదర్శన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్ రెడ్డి జె వెంకటేశ్, న్యాయవాదులు నరసింహ రెడ్డి, నీలకంఠ రావు, జగన్మోహన్ రెడ్డి, శ్రీరామ గౌడ్, దయాకర్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, శ్యామ్ బాబు, మద్దెపల్లి శంకర్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సిరికొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా కాపాడాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేశ్ కోరారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ ఎదుట గల ప్రభుత్వ స్థలాన్ని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేయాలని చూస్తున్నారని తెలిపారు. ఆ స్థలంలో 2023లో గత ప్రభుత్వం ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ. 40 లక్షల నిధులు మంజూరు చేయగా నాటి ఎమ్మెల్యే పనులకు శంకుస్థాపన చేశారన్నారు. నాలుగు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఆ శిలాఫలాకాన్ని ధ్వంసం చేసి కబ్జాకు పాల్పడుతున్నారని అన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. నాయకులు సాయారెడ్డి, దామోదర్, రమేశ్, కిశోర్ తదితరులు ఉన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ సిటీ: మల్లారం గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాకు యత్నిస్తున్నారని వెంటనే వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతు సంఘం నాయకులు నుడా చైర్మన్‌కేశ వేణుకు శనివారం ఫిర్యాదు చేశారు. జిల్లా కేంద్రానికి చెందిన కొందరు కబ్జాదారులు దొంగ పాసు పుస్తకాలు తయారుచేసి అందులో 3 ఎకరాల ఒక్క గుంట భూమి ఉన్నట్లు సృష్టించారన్నారు. రెవెన్యూ అధికారులు కూడా అక్రమార్కులతో కుమ్మక్కయ్యారని తెలిపారు. విచారణ చేపట్టి


వినతిపత్రం అందజేస్తున్న రైతు నాయకులు

తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కేశ వేణును కలిసినవారిలో పెద్ది వెంకట్రాములు, రమేష్, భూమయ్య తదితరులున్నారు.

భూకబ్జాపై పోలీసులకు ఫిర్యాదు

ఇందల్వాయి: మండలంలోని మల్లాపూర్‌లో 262, 263 సర్వే నంబర్లలో ప్రభుత్వ స్థలాన్ని కొందరు అక్రమార్కులు కబ్జా చేస్తున్నారని గ్రామస్తులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టిన కబ్జాను అడ్డుకోవాలని కోరారు. మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ప్రకాశ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రం తనిఖీ

సిరికొండ: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ రవీందర్ రావు, ఎస్సై ఎల్ రామ్ శనివారం తనిఖీ చేశారు. కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఎండలు విపరీతంగా ఉన్నందున తాగు నీటిని తగినంత ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు.

జీపీ భవన నిర్మాణ పనులకు భూమిపూజ


నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు

డిచ్‌పల్లి: మండలంలోని కొరట్‌పల్లిలో నూతన గ్రామ జీపీ భవన నిర్మాణ పనులకు శనివారం భూమి పూజ చేశారు. జీపీ భవన నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలసాని శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ రాంచందర్‌గౌడ్, డైరెక్టర్ న్యాస రాజేశ్వర్, డాక్టర్ షాదుల్లా, మర్కంటి శ్రీనివాస్, డాక్టర్ జహూర్, గంగారెడ్డి, సాయిరెడ్డి, ప్రభాకర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్ సేవలు అభినందనీయం



నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్ సేవలు అభినందనీయమని కమిషనర్ దిలీప్‌కుమార్ అన్నారు. నగరంలోని బల్దియా కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన డిప్యూటీ కమిషనర్ ను అధికారులు, ఉద్యోగులు,సిబ్బందిని శనివారం ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. 38 ఏళ్ల కాలంలో ప్రభుత్వ అధికారిగా నిజాయితీగా పనిచేసిన సంతృప్తి మిగిలిందని డీసీ రాజేంద్రకుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షల ఫీజులను తగ్గించాలి

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షల ఫీజులను తగ్గించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. శనివారం ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ చాంబర్ ఎదుట నిరసన తెలిపారు. ఫీజుల విషయంలో కాకతీయ యూనిర్సిటీకి, తెలంగాణ వర్సిటీకి వ్యత్యాసం చాలా ఉందన్నారు.కార్యక్రమంలో నాయకులు మనోజ్, విజయ్, సురేశ్, జీవన్, వివేక్, డానియల్, కాశిఫ్ తదితరులు పాల్గొన్నారు. పరీక్ష ఫీజులను తగ్గించాలని ఏబీవీపీ నాయకులు ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సునీల్, బాలకృష్ణ, నరేందర్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

తెయూ ప్రీ పీహెచ్‌డీ పరీక్ష ఫీజు చెల్లించండి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ప్రీ పీహెచ్‌డీ 2023–24 రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరిశోధక విద్యార్థులు ఏప్రిల్‌లో జరగనున్న పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లించాలని కంట్రోలర్ ప్రొఫెసర్ కే సంపత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్, సోషల్‌సైన్స్, ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో అడ్మిషన్ పొందిన పరిశోధక విద్యార్థులకు ఈ షెడ్యూల్ వర్తిస్తుందన్నారు. ఏప్రిల్ 8వ వరకు రూ.1000లు, అపరాధ రుసుము రూ.500లతో ఏప్రిల్ 10వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని కంట్రోలర్ తెలిపారు. పూర్తి వివరాలకు www. telanganauniversity. ac. in వెబ్ సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

రైతు ఆదాయం రెట్టింపు చేయడమే మోదీ లక్ష్యం

సుభాష్‌నగర్: దేశంలోని రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయడమే ప్రధాని మోదీ లక్ష్యమని, కేంద్ర ప్రభుత్వం రైతు ప్రభుత్వమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాని మోదీ అధ్యక్షతన నిర్వహించిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ప్రధానంగా రైతులకు ఊరట కలిగించే నిర్ణయాలు తీసుకుందని హర్షం వ్యక్తంచేశారు.వానాకాలం సీజన్‌కు ఫాస్పేట్, పొటాష్ ఎరువులపై సబ్సిడీని కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుందన్నారు. పశువుల ఆరోగ్యం కోసం క్రిటికల్ ఎనిమల్ డిసీస్ కంట్రోల్ ప్రోగ్రాం నిర్వహిస్తుందని పేర్కొన్నారు.

పడకంటి రాముకు డాక్టరేట్

నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ యువ వ్యాపారవేత్త, సమాజ సేవకుడు పడకంటి రాముకు అమెరికాకు చెందిన జార్జియా యూనివర్సిటీ శుక్రవారం ఆగ్రాలో నిర్వహించిన కాన్వొకేషన్ ప్రోగ్రాంలో డాక్టరేట్‌ను అందించారు. తాను చేసిన సమాజ సేవలను గుర్తించిన యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందించిందని రాము తెలిపారు.

పసుపు పరిశ్రమ సందర్శన

జక్రాన్‌పల్లి: మండలంలోని మనోహరాబాద్ జేఏంకేపీఎం పసుపు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పసుపు పరిశ్రమను ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి కుమార్తె ప్రముఖ వ్యాపారవేత్త సుచరితరెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే మొట్టమొదటి టర్మరిక్ క్లస్టర్ ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. పసుపు పరిశ్రమతో ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ పాట్కురి తిరుపతిరెడ్డి, సంతోష్, వకీల్ గంగారెడ్డి, అంకాపూర్ సురేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పద్య ప్రతిభారత్న పురస్కారానికి ఓం ప్రకాశ్ ఎంపిక

జక్రాన్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన సాహితివేత్త, పద్యకోకిల, అష్టావధాని ఓంప్రకాశ్ పద్య ప్రతిభారత్న పురస్కారానికి ఎంపికయ్యారు. సాహితీ రంగంలో చేస్తున్న కృషికిగాను హైదరాబాద్‌లోని విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో అందజేస్తున్న విశిష్ట పురస్కారానికి అతను ఎంపికయ్యారు. ఈ సంస్థ తరఫున తనకు సమాచారం అందినట్లు ఆయన పేర్కొన్నారు. ఉగాది రోజున ఈ పురస్కారం అందుకోనున్నట్లు తెలిపారు.

ఆర్మీ అగ్నివీర్‌కు సీఎస్‌ఐ విద్యార్థుల ఎంపిక

నిజామాబాద్ రూరల్: నగరంలోని సీఎస్‌ఐ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు నితిన్, సాయితేజ, గణేశ్ ఇటీవల ప్రకటించిన ఆర్మీ అగ్నివీర్ ఫలితాల్లో విజయం సాధించి ఉద్యోగాలు పొందారు. ఈ సందర్భంగా కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను కళాశాల ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ ఎం రాజేశ్వర్, ప్రిన్సిపాల్ భాగ్యరావు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. అగ్నివీర్ ఉద్యోగాల్లో ఎన్‌సీసీ కెడెట్స్‌కు 20 శాతం రిజర్వేషన్ ఉంటుందని రాజేశ్వర్ పేర్కొన్నారు.

కార్మికుల సంక్షేమం పట్టని కమిషనర్

నిజామాబాద్ సిటీ: కార్పొరేషన్ కోసం విధులు నిర్వహిస్తున్న కార్మికుల సంక్షేమాన్ని బల్దియా అధికారులు పట్టించుకోవడంలేదని, ప్రజల కష్టార్జితాన్ని అవుట్‌సోర్సింగ్ కంపెనీలకు దోచిపెడుతున్నారని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ శనివారం ఆరోపించారు. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం అప్పులు తెచ్చి ప్రభుత్వాన్ని నడుపుతుంటే, మరోపక్క నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మాత్రం హైదరాబాద్‌కు చెందిన బడా కాంట్రాక్టర్లకు అప్పనంగా లక్షలాది రూపాయలు ధారపోస్తున్నారన్నారు.

ఔట్ సోర్సింగ్ కార్మికుల కాంట్రాక్ట్ విధానం ద్వారా హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్లకు నెలకు రూ.2,25,760 ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు నాలుగు రోజులుగా కార్యాలయం ఎదుట ధర్నా చేసినా మున్సిపల్ కమిషనర్ చలించలేదన్నారు. వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం

ఇందల్వాయి: నల్లవెల్లి సహకార సంఘం కార్యాలయంలో మహాజన సభను చైర్మన్ నోముల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఆరు నెలల కాలంలో సంఘం నిర్వహించిన లావాదేవీలను సీఈవో తేజాగౌడ్ వివరించారు. ధాన్యం కొనుగోళ్లకు పూర్తి సన్నద్ధంగా ఉన్నట్లు చైర్మన్ తెలిపారు. బంగారు రుణాలపై వడ్డీశాతం తగ్గించామని, పేరుకుపోయిన దీర్ఘకాలిక రుణాల వసూళ్లకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వైస్ చైర్మన్ రమేశ్, క్యాషియర్ రాజన్న, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్ కియో కరాటే పోటీలకు హాజరైన నేతలు

నిజామాబాద్ సిటీ: నేషనల్ కియో కరాటే చాంపియన్ షిప్ పోటీలు హైదరాబాద్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. గచ్చిబౌలిలో నిర్వహించిన ఈ పోటీల ప్రారంభ ఉత్సవాలకు పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించాలి

సిరికొండ: విద్యార్థులు చదువులో ఉన్నత స్థాయిలో రాణించాలని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ రావుట్ల నర్సయ్య సూచించారు. నవోదయకు ఎంపికైన ఇద్దరు విద్యార్థులు వి సాధ్వి, టి శివానిలకు పాఠశాలలో శనివారం జ్ఞాపికలు అందచేసి సత్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతు కఠినమైన పోటీ పరీక్షలో ప్రతిభ కనబర్చి జవహర్ నవోదయకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు వీరమల్లు ప్రశాంత్, తోట భోజరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామాయణాన్ని చదవాలి

నిజామాబాద్ రూరల్: రామాయణాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న బస్వాగార్డెన్‌లో విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ జిల్లా సన్నాక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. హనుమాన్ జయంతిని ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్‌చాలక్ గురుచరణ్, దినేశ్ ఠాకూర్, దయానంద్, దాత్రిక రమేశ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

జక్రాన్‌పల్లి: మండలంలోని చింతలూర్‌లో సీసీ రోడ్డు పనులను కొలిప్యాక్ సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నాగుల గోపి, జలందర్, అఖిలాష్, గంగాధర్, హన్మాండ్లు, నాగుల లింబాద్రి, నాగుల శివప్రసాద్, గడ్డం వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని నాగారం ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించాలని ఐద్వా నాయకులు అన్నారు. శనివారం నాగారంలో ఐద్వా నాయకులు సుజాత, అనిత లు కాలనీ వాసులతో మాట్లాడారు. తాగునీటి సమస్య, మురికినీటి కాల్వలు లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు.

‘గోర్ బోలి’కి ప్రాధాన్యత ఇవ్వడంపై హర్షం

ధర్పల్లి: గోర్ బోలి భాషను రాజ్యాంగంలోని 8 షెడ్యూల్‌లో చేర్చడంపై బంజారా నాయకులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. గోర్ బోలి భాషకు గుర్తింపు తెచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఎల్లప్పుడు రుణపడి ఉంటామని నాయకులు తెలిపారు.

ఆలయంలో గోటి తలంబ్రాల దీక్ష

నిజామాబాద్ రూరల్: గజ్వేల్‌లోని శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ శనివారం నగరంలోని కోటగల్లీలో ఉన్న మార్కండేయ స్వామి ఆలయంలో గోటి తలంబ్రాల దీక్ష నిర్వహించారు. భక్తులు గోటి తలంబ్రాల్లో పాల్గొని రామస్మరణ చేశారు. గోటితో వడ్లను ఒలిచి తలంబ్రాలు తయారు చేసి సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజుకు అందజేశారు.

ఐక్యత చాటే పండుగ

సంస్కృతి, సంప్రదాయాలు, మన వారసత్వం
ఉగాది పండుగ వాటికి నిదర్శనం
తాతల నాటి కథలు, అమ్మమ్మల పాటలు
కుటుంబ సభ్యులంతా, ఒకచోట చేరి వేడుక
పిల్లలు, పెద్దలు, కలిసి నవ్వుకునే క్షణాలు
గుర్తుండిపోయే జ్ఞాపకాలు, మన జీవితాలు
పొంగలి రుచితో, మనస్సు నింపే ఆనందం
దాన ధర్మాలు చేసి పేదలకు సహాయం.
సమాజం పట్ల బాధ్యత గుర్తుచేసే వేడుక
ఉగాది శుభాకాంక్షలతో.
ఐక్యతను చాటే పండుగ.



రచన: ఎన్.లాస్యశ్రీ (6వ తరగతి), విజయ్ హైస్కూల్, ముబారక్‌నగర్.

ఉప్పొంగే ఉత్సవం

నూతన సంవత్సరం వచ్చింది
వేప చెట్టుకు పూత పూసింది
తీపి సంతోషాల హరివిల్లు విరిసింది
గుమ్మానికి పచ్చని తోరణం తెచ్చింది
ఉప్పొంగే ఉత్సవం వచ్చింది
మనందరికీ కొత్త కోరికలు కల్పించింది
వేపతో చేదు అనుభవాలను చింతతో పులుపును
పచ్చి మామిడితో కొత్త సవాళ్లను విసిరింది
ఆరు రుచులతో ఆనందంగా
జరుపుకునే పండుగే ఉగాది



రచన: టి.మధుప్రియ (9-సి), జెడ్పీహెచ్‌ఎస్ బోర్గాం (పీ)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	91,400	వెండి(కిలో)	1,05,000
22 క్యారెట్స్	83,360	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	40	60
జీరకాయ	50	70	దోసకాయ	30	50
దొండకాయ	30	60	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	30	50	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	15	30
వంకాయ	10	20	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	70	120
మెంతికూర	30	50	చామగడ్డ	50	70
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	30	50	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	35	60	– సుభాష్‌నగర్		

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-10.45, 1.20, 4.20, 7.20, 10.20
స్క్రీన్-2	వీర ధీర శూరన్(తెలుగు)-10.50, 7.40
	రాబిన్‌హుడ్(తెలుగు)-1.40
	ఎల్-2 ఎంపురాన్(తెలుగు)-4.20, 10.30
స్క్రీన్-3	వీర ధీర శూరన్(తెలుగు)-1.30
	రాబిన్‌హుడ్(తెలుగు)-4.30, 7.30, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	రాబిన్‌హుడ్(తెలుగు)-10.10, 1.20, 4.30, 7.40, 10.50
స్క్రీన్-2	ఎల్-2 ఎంపురాన్(తెలుగు)-10.10
	కోర్ట్(తెలుగు)-1.45
స్క్రీన్-3	వీర ధీర శూరన్-పార్ట్-2 -10.05, 4.10, 7.30, 10.50
	మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-1.25
స్క్రీన్ -4	మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-10.00
	ఎల్-2 ఎంపురాన్ -12.45, 7.25, 11.00
	కోర్ట్(తెలుగు)-4.20
లలితామహల్ కోర్ట్, దేవి	రాబిన్‌హుడ్
నటరాజ్ షణ్ముఖ, విజయ్	మ్యాడ్ స్క్వేర్